# ★ క్షణంలో సగం ★

"శారద"

గణగణ మన్నయ్ గంటలు. ఎక్కడిదీ గంటల శబ్దం? అనంత ప్రపంచం ప్రకృతి దేవాలయం ముందు మోకరిల్లి వొద్దు మాకీ యుద్ధమని చెప్పే బాధ కాదు ఈ గంటల నినాదం-! పాపం! ఆర్తత్రాణ పరాయణత్వం ఏనాడో వొదిలి పదవీచ్యుతుడైన జ్ఞాన సంపన్నత ప్రసరించిన మానవ నిరాకరణతో ధ్వంసుడైన దేవుడి ఆర్తనాదమేమో? ఆకారం నశించి మూలుగుతున్న ఆధ్యాత్మ భావాల ధ్వనికూడా కావచ్చు.

కొరియాలో యుద్ధ ప్రళయం కలిగించిన ధరల విలయంలో సంసారి పెట్టే ఘోషకూడా కావచ్చు. ఉం...ఉండండి ఆ గంటల ధ్వనిలో ఏదో మానవ స్వరం వినిపిస్తున్నది.

'నీకన్నీ అట్లాగే వినిపిస్తయి' అంటున్నాడు తర్కశాస్త్రం చదువుకున్న విలాసరావు.

విలాసరావు ప్రపంచాన్నీ జీవాన్నీ సైన్సు ప్రకారం భౌతిక దృష్టిలో చూచి తూకం వేస్తాడు. మనిషిని మరలతో, మెదడులేని యంత్రాలతో పోల్చి అలవాట్ల సముదాయంగా కొలుస్తాడు.

ఆధ్యాత్మికులు ప్రచారంచేసి వొదిలిన చెత్తని పునరుజ్జీవనం చేసే బెర్ట్రండ్ రస్సెల్ భావలాని సర్కస్సునీ, ఉద్ధాట్టహాసాన్ని-డౌనింగ్ స్ట్రీట్ 10వ నెంబరు అజ్ఞల్ని, వాషింగ్టన్ వెర్రికేకల్ని, మనుషులకి నీతిగా న్యాయంగా ప్రచారం చెయ్యడం, విలాసరావుకి ఫాషన్ అయింది.

ఆదేకాదు.

సున్నితంగా - సుకుమారంగా-నిజమైన హృదయానుతాపంతో వింతేగాని అర్థంగాని మానవాక్రందన - ప్రకృతి ఘోష - వినిపించదు విలాసరావులాంటి జ్ఞానసంపన్నులకి. కులభేధాల క్రూరత్వం మీద శతాబ్దాల తరబడిగా వినుగులేక ఉపన్యసించిన విలాసరావు ఎం. ఏ. ఎల్. ఎల్. బి.-కమ్యూనల్ జీ. వో. రద్దయిపోగలదని విలయ తాండవం చేస్తున్నాడు. కాలేజీలు మూడేవుంచి సీట్లు అందరికీ, కులాలవారీ నిష్పత్తిలో పంచిపెట్టడం;అణగదొక్కబడ్డ వాళ్ళపట్ల ఔదార్య ప్రకటన చెయ్యడం, విలాసరా॥ లాంటి విజ్ఞానికి ఇష్టం. ఫ్యాషన్. అవసరం. రా॥ కీయ తంత్రం...!

ఈ తర్కం అంతటి విజ్ఞానంలేని సామాన్యులైన, నాకూ నీకూ ఈజనానికి అందకపోవచ్చు అర్థంకాకపోవచ్చు. కాని ఒక సత్యం మాత్రం అద్దంలో ప్రతిబింబంలాగా కనిపిస్తూంది. ఎంత అజ్ఞానికి కూడా అవగాహన అవుతుంది. ఎక్కువ కాలేజీలుండి, అందరికీ, చదువుకోవాలన్న ప్రతివాడికీ సీట్లు ఉండటం కాదా న్యాయం? అందరికీ పని కల్పించటం కాదా, కర్తవ్యం? ఉన్న మూడు ఉద్యోగాల్ని పంచటానికి జీ. వో. లు సృష్టించి, దాన్ని సమర్థించటానికి విలాసరావుల్నీ, తర్కశాస్త్రిల్నీ పోగుచేసుకోవటం జ్ఞానమా — విజ్ఞానమా?

కాని ఇట్లాంటితర్కాన్నే-విశాలప్రచారమూ నిష్పక్షపాతికమూ 'స్వాతంత్రం సౌభ్రాతృత్వం - ట్రేడ్ మార్కులా వేసుకున్న దినపత్రికలు పతాక శీర్షికలతో ప్రచురిస్తోవుంటే- అనాధ మానవులు ఎక్కడ చెప్పుకోగలరు? ఏ కోర్టులు విచారించి ఏం న్యాయం మండిస్తాయి?

తెలివిగల వాళ్ళకి ఉద్యోగా లివ్వటం స్వార్థం అయితే, తెలివి తక్కువవాళ్ళకి అధికారా లిచ్చి, పరిపాలనని అయోమయం చెయ్యటం నిస్వార్థం అవుతుంది కాబోలు! ఏమయినా విలాసరావు విజ్ఞానాన్ని, కాదంటానికి ఈ అజ్ఞానులకి ఆస్కారం ఎక్కడిది?

ఆ గంటల నిక్వాణంలో వినిపించే నిర్వచనం ఏమిటో! లోకాన్ని ఆవరించుకునే భయావహమైన చీకట్లకి దయ గల్గుతుందని ప్రార్థనలు చెయ్యటం వృధా. వెలుగు వొచ్చేవరకూ వేచివుంటానికి సుఖమైన నిండు విస్తళ్లూ, మెత్తని శయ్యలూ, అందమైన బానిస భార్యలూ మనకి-దరిద్రులకి-లేవు. వెంటనే కనిపించే భవిష్యత్తులో వెలిగే ఉషా కన్యకోసం ఎదురు వెళ్ళాలిమనం.